క్లుప్తంగా

నీటి సరఫరా కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రాంబాబు

తగరపువలస: ప్రభుత్వం తాగునీటి, పారిశుధ్య కార్మికుల సమస్యలను జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీపీఐ భీమిలి ఏరియా నాయకులు డిమాండ్ చేశారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, ఆదినారాయణ తదితరులు మాట్లాడారు. రెండు రోజుల పాటు అవుట్ సోర్సింగ్ తాగునీటి కార్మికులు చేపట్టిన సమ్మె కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ రెండు విభాగాల కార్మికులకు తాము అండగా ఉంటామన్నారు.

పారిశుధ్య కార్యక్రమాల పరిశీలన



తునివలసలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

పద్మనాభం: మండలంలోని తునివలస గ్రామంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ శనివారం పర్యటించారు. వీధుల్లో పర్యటించి, పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు చెత్త ఎలా సేకరిస్తున్నారు, రక్షిత మంచి నీటి పథకాల క్లోరినేషన్ చేశారా లేదా తదితర అంశాలను పరిశీలించారు.

నేడు మెగా జాబ్‌మేళా

కొమ్మాది: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమిలిలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పదికి పైగా మల్టీనేషనల్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90147 58949 సంప్రదించాలని కోరారు.

క్రీడలతో సామరస్యం



విజేతలకు బహుమతులు అందిస్తున్న సిరి సహస్ర

తగరపువలస: తరచూ క్రీడల నిర్వహణ వలన ప్రాంతాల మధ్య సామరస్యం ఏర్పడుతుందని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర అన్నారు. చిట్టివలస బంతాట మైదానంలో శనివారం ముగిసిన ప్రీమియం లీగ్ సీజన్-1 క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ఆమె ముఖ్యఅతిథిగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికరణ్‌రెడ్డి, జీరు వెంకటరెడ్డి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కరమాని చినబాబు, ఉప్పాడ నాగేశ్వరరావు, జి.సృజన, పందిరి విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యావతారంలో జగన్నాథుడు



మత్స్యావతారంలో దర్శనం ఇచ్చిన జగన్నాథస్వామి

కొమ్మాది: జగన్నాథస్వామి రథోత్సవాలను భీమిలిలోని జగన్నాథ స్వామి దేవాలయంలో వేడుకగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామి వారిని శనివారం మత్స్యావతారంలో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భీమిలి పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి తప్ప క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు పద్మనాభం మండలంలోని శేరిఖండం, అర్చకునిపాలెం, పద్మనాభం గ్రామాల్లోని ప్రభుత్వ నర్సరీలే నిదర్శనం. ఈ నర్సరీల్లో రైతులకు సరఫరా చేసేందుకు వేలాది మొక్కలు సిద్ధంగా ఉన్నా, ప్రభుత్వ అనుమతులు రాకపోవడంతో ఇంకా పంపిణీ ప్రారంభించలేదు. దీంతో రైతులు అధిక ధరలను వెచ్చించి ప్రైవేట్ నర్సరీల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

నర్సరీల్లోనే మొక్కలు రైతుల అవస్థలు



అర్చకునిపాలెంలోని ప్రభుత్వ నర్సరీలో నీలగిరి మొక్కలు

- ప్రభుత్వ నర్సరీల నుంచి రైతులకు సరఫరా కాని మొక్కలు
- ప్రైవేటు నర్సరీల్లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు
- ప్రభుత్వం నుంచి రాని అనుమతులు
- రైతులపై ఆర్థిక భారం

మండలంలో సాగవుతున్న భూమి	
పల్లం	5.523 ఎకరాలు
మెట్టు	17,351 ఎకరాలు
2024లో	
సరుగుడు	250 ఎకరాలు
నీలగిరి	107 ఎకరాలు



ప్రభుత్వ నర్సరీలోని బొప్పాయి

పద్మనాభం: మండలంలోని మెట్టు భూముల్లో నీలగిరి, సరుగుడు సాగు అధికం. రైతులు ఈ మొక్కలను నర్సరీల నుంచి కొనుగోలు చేసి, సాగు చేస్తారు. ప్రైవేట్ నర్సరీల కంటే ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు సగానికి పైగా తక్కువ ధరకు వస్తాయి. దీంతో పెట్టుబడి తగ్గుతుందని రైతులు ఆశగా చూస్తున్నారు. అటు ప్రభుత్వ నర్సరీల్లోనూ వేలాది మొక్కలు సాగుకు సిద్ధంగా ఉన్నాయి, కానీ ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో ఇంకా పంపిణీ ప్రారంభం కాలేదు. వర్షాలు జోరుగా కురుస్తుండటంతో కొందరు రైతులు ప్రైవేట్ నర్సరీలను ఆశ్రయిస్తున్నారు.

వేలల్లో మొక్కలు

అర్చకునిపాలెంలోని ప్రభుత్వ నర్సరీలో నీలగిరి మొక్కలు సుమారు 30 వేలు, సరుగుడు సుమారు 60 వేలు, పద్మనాభంలో 30 వేలు, సరుగుడు 60 వేలు, శేరిఖండంలో నీలగిరి 30వేలు, సరుగుడు 60వేలు ఉన్నాయి. వీటితో పాటు జామ, నిమ్మ, బొప్పాయి, మునగ, ఉసిరి, మునగ, మహా గని, కాగు వంటి వేలాది మొక్కలు ఉన్నాయి. 15 రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు మొక్కల కోసం ప్రభుత్వ నర్సరీల వద్దకు వెళ్తున్నారు. కానీ, ఇక్కడ మొక్కల సరఫరా ప్రారంభించకపోవడంతో రైతులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రైవేటు నర్సరీల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.

ప్రైవేట్ నర్సరీల్లో జోరుగా విక్రయాలు

అర్చకునిపాలెంలో 12 వరకు ప్రైవేటు నర్సరీలు ఉన్నాయి. ఈ నర్సరీల్లో అనేక రకాల మొక్కలు అమ్ముతున్నారు. ప్రైవేటు నర్సరీల నిర్వాహకులు భద్రాచలం నుంచి నీలగిరి మొక్కలు తెచ్చి అమ్ముతున్నారు. రైతులు ఈ నర్సరీల్లో నీలగిరి మొక్కలు రూ.6, సరుగుడు రూ.5కు కొనుగోలు చేసి ఆటోలు, టాటా ఏస్ వాహనాల్లో తీసుకు వెళ్లి పొలాల్లో నాటుతున్నారు.

ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు ఉండి ప్రైవేటు నర్సరీల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ నర్సరీలో మొక్కలను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ అనుమతి కోసం చూస్తున్నాం

ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలను సరఫరా చేయిడానికి ప్రభుత్వం నుంచి అనుమతి రావాలి. ఇంకా రాలేదు. అనుమతి వచ్చిన వెంటనే మొక్కలను సరఫరా చేస్తాం.

– నారాయణరావు, అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్



ప్రభుత్వ నర్సరీలోని ఉసిరి



పద్మనాభం ప్రభుత్వ నర్సరీలోని సరుగుడు మొక్కలు



అర్చకునిపాలెంలోని ప్రైవేట్ నర్సరీల్లోని నీలగిరి మొక్కలను కొని ఆటోల్లో తీసుకువెళ్తున్న రైతులు



అర్చకునిపాలెంలోని ప్రభుత్వ నర్సరీలోని మొక్కల్లో కలుపు తీస్తున్న కూలీలు

బకాయిలు తీసుకోని కార్మికులకు చివరి అవకాశం

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో బకాయిలు తీసుకోని కార్మికుల కోసం చివరిసారిగా జూలై 2 నుంచి 20 వరకు మరో అవకాశం ఇస్తున్నట్టు ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధుల సమావేశంలో మిల్లు యజమాని, అధికారులు ప్రకటించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, యజమానితో శనివారం చర్చలు జరిపారు. మైక్, కరపత్రాల ద్వారా ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహించి, పైన పేర్కొన్న గడువులో మిల్లు గేటు వద్ద కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించినందున కార్మికులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. బకాయిలు చెల్లించిన తరువాత మిల్లు ఆస్తులపై కార్మిక సంఘాలు అటాచ్‌మెంట్ తీయడానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో యజమాని బజోరియా అంగీకరించారు. సమావేశంలో జేసీఎల్ రామారావు, మధురవాడ జోన్ ఏసీపీ అప్పలరాజు, కార్మిక సంఘాల ప్రతినిధులు కాకర్లపూడి వరహాలరాజు, జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరమణ, జీరు కైలాస్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ, కొండపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలసదనంలో సత్వర చికిత్స కేంద్రం



భీమిలి బాల సదనంలో పాల్గొన్న వైద్య బృందం

తగరపువలస: భీమిలి బాలసదనంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా శనివారం జిల్లా సత్వర చికిత్సా కేంద్రం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రత్యేక వైద్యులు జనన, పోషకాహార లోపాలు, వ్యాధులు, అభివృద్ధిలో జాప్యం సమస్యలను గుర్తించి, చికిత్స అందించారు. పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను స్క్రీనింగ్ చేశారు. సమస్యలతో గుర్తించిన పిల్లలను ఆర్‌బీఎస్‌కేకు రిఫర్ చేసి, చికిత్స అందించనున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనానికి శంకుస్థాపన



ఆనందపురంలో డిగ్రీ కళాశాల భవనాలకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: ఏడాది లోగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం పంచాయతీలో రూ.4.50 కోట్లు పీఎం ఉషా నిధులతో ఐదు ఎకరాలలో నిర్మించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి శనివారం ఆయన భూమిపూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ భవనం పూర్తయితే హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకేచోట ఉన్నట్టు ఉంటుందన్నారు. ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, సర్పంచ్ చందకలక్ష్మి, ఉప సర్పంచ్ బంటుపల్లి రమణమ్మ, ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి, ఎంపీడీవో జానకి, బమ్మిడి ఉమ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన టీడీఆర్ అందించేందుకు చర్యలు

- సీసీపీ ప్రభాకర్
- మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిశీలన



రేవళ్లపాలెం రోడ్డులో టీడీఆర్ అందని బాధితులతో మాట్లాడుతున్న సీసీపీ ప్రభాకర్

మధురవాడ: మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన బాధితులకు టీడీఆర్‌లు త్వరితగతిన అందించేందుకు చర్యలు చేపడతామని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర్ తెలిపారు. జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధిలోని నగరంపాలెం, రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్లలో పెండింగ్ టీడీఆర్ దరఖాస్తులు, వాటి స్థితిని శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. రేవళ్లపాలెం, బక్కన్నపాలెం, కొమ్మాది, బోయిపాలెం-కాపులుప్పాడ తదితర మాస్టర్ ప్లాన్ రోడ్లుల్లో సుమారు 85వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో బాధితుల తరపున గ్రామ పెద్దలు వెంకటరావు, వాండ్రాసి సూరిఅప్పారావు తదితరులు కలిసి, తమ గ్రామానికి చెందిన వారికి టీడీఆర్‌లు త్వరగా ఇప్పించాలని కోరగా.. ఇందులో 18 మందికి తొందరలో వచ్చే అవకాశం ఉందని సీసీపీ చెప్పారు.

మీడియా కంటపడకుండా ఉండేందుకు పాట్లు

ఈ పర్యటన సందర్భంగా న్యూస్ కవర్ చేసేందుకు విలేకరులు వెళ్లగా ఇది రొటీనే అని, వెళ్లిపోవాలంటూ ముఖం చాటేశారు. చాలాసేపు మీడియా కంట పడకుండా ఉండేందుకు పాట్లు పడ్డారు. కనీసం ఫొటో కూడా తియ్యనియ్యకుండా కారులో నుంచే పరిశీలన చేసి, అందులో నుంచే సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరావు, టీపీవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ట్రైనర్ సురేష్ కుమార్

పద్మనాభం: విద్యార్థులు లక్ష్యం ఏర్పాటు చేసుకుని, ముందుకు సాగాలని హైదరాబాదుకు చెందిన ఫ్రీలాన్స్ ట్రైనర్ జరజాపు సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శనివారం నిర్వహించిన తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఓటమి చెందినప్పుడు కుంగిపోకూడదన్నారు. గెలుపు, ఓటములు సహజమని, వీటిని తట్టుకుని ముందుకు వెళ్లినప్పుడే లక్ష్యానికి చేరుకోగలరని తెలిపారు. సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఆరోగ్య సూత్రాలు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, సోషల్ వర్కర్ జోగారావు పాల్గొన్నారు.

లక్ష్మీపురం హైస్కూల్లో అవగాహన

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు సురేష్‌కుమార్ మోటివేషన్ తరగతులు నిర్వహించారు. కెరీర్ గైడెన్స్, పౌష్టికాహారం, పదో తరగతిలో మంచి మార్కులు సాధించడం, ఒత్తిడిని అధిగమించడం తదితర విషయాల గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు సురేష్‌కుమార్‌ను సత్కరించారు. హెచ్‌ఎం దంతంశెట్టి సత్యారావు, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, సత్యనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ మొకర శంకరరావు, కళా సాహితి సభ్యుడు కె.జోగారావు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పంచాయతీ పెద్దలు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్ నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన 17 మంది ఉపాధ్యాయులను ప్రస్తుత ఉపాధ్యాయులు, పంచాయతీ పెద్దలు శనివారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కొట్యాడ సత్యమూర్తి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ బంటుపల్లి లక్ష్మి, కొట్యాడ రెడ్డిబాబు తదితరులు జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. సన్మానం పొందిన ఉపాధ్యాయుల్లో సత్యనారాయణ, బంగారం, శ్రీనివాస్, అజీమ్, విజయలక్ష్మి, నిర్మల తదితరులు ఉన్నారు.

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తులు ముందుగా శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గల పద్మావతి, గోదాదేవి, ఆంజనేయ స్వామి వార్లకు భక్తులు పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారి నామ సంకీర్తనలు, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆర్‌ఎంపీ వైద్యులకు జీవిత బీమా

కొమ్మాది: భీమిలిలో ఆరాధ్య ఫస్ట్ ఎయిడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్‌ఎంపీ వైద్యులకు ఉచిత బీమా సదుపాయం కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ లీగల్ అడ్వైజర్ డాక్టర్ ఎస్.ఎల్.రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులకు భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి ఒక్కరికి రూ.6 లక్షల జీవిత బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. వారికి ఉచిత బీమా పత్రాలను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు సుగుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, మాతృభూమి సేవా సంఘ సభ్యుడు గోపీ, సాగర దుర్గ సింహాద్రి ఆస్పత్రి యజమాని డి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

‘ప్రభుత్వ అధికారులు తీరు మార్చుకోవాలి’



వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు

తగరపువలస: భీమిలి మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులపై ప్రభుత్వ అధికారులు తీరు మార్చుకోవాలని వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు కోరారు. శనివారం ఆయన భీమిలిలో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల పట్ల చిన్నచూపు చూస్తూ అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారన్నారు. ఆయా పంచాయతీలలో అధికారులు పర్యటిస్తున్న సమయంలో, అధికార కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు సర్పంచ్‌లు, ఎంపీటీసీ ప్రతినిధులకు సమాచారం ఉండటం లేదన్నారు. కూటమి నాయకుల వెనుక తిరుగుతున్న అధికారులు, ప్రజలచే ఎంపికైన వారిని ఉద్దేశపూర్వకంగానే అవమానిస్తున్నారన్నారు. అధికారులు కూడా కూటమి నాయకులుగా వ్యవహరిస్తున్నారన్నారు. పంచాయతీలలో సమస్యలు ఉన్నప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్దామన్నా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదన్నారు. ముఖ్యంగా ఎంపీడీవో, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ, డీఈలు ఫోన్ లిఫ్ట్ చేసి పక్కన పెట్టి తమను అవమానిస్తున్నారన్నారు. అధికారులు తమ ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకపోయినా, తీరు మార్చుకోకపోయినా వైఎస్సార్‌సీపీ తరపున సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల ముందు శాంతియుత ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

రుషికొండ తీరంలో ‘స్వచ్ఛ విశాఖ’



తీరంలో సేకరించిన వ్యర్థాలతో అధికారులు, వలంటీర్లు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ విశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఏపీ హెచ్‌ఆర్‌డీఐ) సహకారంతో జీవీఎంసీ అధికారుల ఆధ్వర్యంలో తీరంలో ఉన్న వ్యర్థాలను శనివారం తొలగించారు. కార్యక్రమంలో ఏపీ హెచ్‌ఆర్‌డీఐ ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

50 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్

ఎంవీపీకాలనీ: విశాఖ జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో సెయింట్ ల్యాబ్స్ ఆఫ్ స్కూల్స్ (సీఎల్ఎస్) పేరిట ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి గణేష్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏఐ, రోబోటిక్ టెక్నాలజీ అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సెయింట్ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకుందని తెలిపారు. సీఎస్ఆర్‌లో భాగంగా సెయింట్ సంస్థ రానున్న 6 ఏళ్లలో విశాఖలోని 50 స్కూళ్లలో సీఎల్ఎస్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు మోహన్‌రెడ్డి, గణేష్ మాట్లాడుతూ ఆధునిక ఏఐ, రోబోటిక్ టెక్నాలజీని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేరువ చేయాలన్నదే ఈ ల్యాబ్స్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశమన్నారు. రూ.8 కోట్లతో విశాఖలోని 50 స్కూళ్లలో ఈ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 28 ల్యాబ్‌లను భీమిలి నియోజకవర్గంలోని పాఠశాలల్లో ఏర్పాటు చేస్తామన్నారు.

పాఠ్య పుస్తకాలు అందక ఇక్కట్లు

తగరపువలస: విద్యాసంవత్సరం ప్రారంభించి రెండు వారాలు పైగా పూర్తయినా ప్రభుత్వ పాఠశాలలకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు చేరలేదు. ముఖ్యంగా నియోజకవర్గంలో 1, 6 తరగతులకు జరిగిన ప్రవేశాలకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో ఉపాధ్యాయులు పక్క పాఠశాలల నుంచి అరువు తెచ్చుకుంటున్నారు. మిగిలిన తరగతులలో చేరిన విద్యార్థులకు కూడా పాఠ్య పుస్తకాలు చేరలేదు. పాఠ్యపుస్తకాల పంపిణీ సకాలంలో చేపట్టవలసిన ఎంఈవోలు, సీఆర్పీలు పట్టించుకోకపోవడంతో పాఠ్య పుస్తకాలు లేకుండానే జూన్ నెల గడచిపోయినట్లయింది. ఇప్పటికైనా పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.